పనులు ఆలస్యం.. ప్రజలకు శాపం

- నత్తనడకన సెంట్రల్ లైటింగ్ పనులు
- విద్యుత్ స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం
- శాఖల మధ్య సమన్వయ లోపం
- ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు



అంగడిబజార్ మూలమలుపు వద్ద ప్రమాదకరంగా స్తంభం

చొప్పదండి: పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పలుచోట్ల పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలబారినపడుతున్నారు. ముఖ్య కూడళ్లలో పనులు చేయకపోవడం, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. రెండేళ్లుగా కొనసాగుతున్న పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, పనుల్లో జాప్యానికి ప్రధాన కారణం అదేనని, పనులపై అవగాహన లోపం ఆలస్యంతోపాటు ప్రమాదాలకు కారణమవుతోంది.

డివైడర్‌తోనే తెలిసింది..

సెంట్రల్ లైటింగ్ పనులలో భాగంగా రోడ్డు విస్తరణ చేశాక తారురోడ్డు నిర్మిస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడిగా డివైడర్ నిర్మించడంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఆపై పనులు ఆగిపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు, మరణించిన వారిలో యువకులే అధికం. రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు ఎప్పుడు వస్తారో, ఎక్కడ పనులు చేయిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. తారు రోడ్డు విస్తరణ చయకముందే డివైడర్ ఎందుకు నిర్మించారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మళ్లీ అదే తీరు..

నిలిచిన సెంట్రల్ లైటింగ్ పనులను తిరిగి ప్రారంభించారు. ఇప్పుడు విద్యుత్, తారురోడ్డు పనులు మొదలు పెట్టారు. విద్యుత్ టవర్ల నిర్మాణం జరిగినా వైర్ల బిగింపు అటకెక్కింది. కొద్ది రోజులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పవర్ కట్ చేసినా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. రోడ్డు మధ్యలో ఉన్న పాత స్తంభాలను తీయడంలో నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ నుంచి సబ్ కాంట్రాక్టర్లు పనులు చేపట్టడంతో అవగాహన లోపం కనిపిస్తోంది. ఏ పనులు చేశాక ఏ పనులు చేయాలో తెలియడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్తంభాలు తొలగించకముందే తారురోడ్డు వేస్తున్నారని, మట్టిని తీసి కంకరతో తొక్కిస్తుండగా, పాత స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అలాగే వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రోడ్డు తవ్విన చోట స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం రోడ్డు పనులు మొదలు పెట్టగా కంకర పనులు పూర్తయ్యాక మళ్లీ పైప్‌లైన్లు వేసేందుకు కందకాలు తీయడం విస్తు గొలుపుతోందని, సెంట్రల్ లైటింగ్ పనులు నత్తనడకన సాగుతుండటం ప్రయాణికుల ప్రాణాల మీదకు వస్తుందని, పనులు పూర్తయ్యే సరికి ఇంకెన్ని వింతలు చూడాల్సి వస్తుందోనని స్థానికులు గొణుక్కుంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలి

రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలి. వాటిని నిర్దేశించిన చోట ఏర్పాటు చేయాలి. ప్రమాదకరంగా మారిన స్తంభాల తీసి రోడ్డు పనులు చేపట్టాలి. అధికారులు పర్యవేక్షణ చేస్తూ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– కొత్తూరి మహేశ్, మాజీ కౌన్సిలర్, చొప్పదండి



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రోడ్డు పక్కన ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు ఎత్తులో ఇళ్లు దిగువన ఉండటంతో వాహనాలు రోడ్డు కిందికి దూసుకువచ్చే ప్రమాదం ఉందని రెయిలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సాయికృష్ణ, ఆర్‌అండ్‌బీ ఏఈ : సెల్ నం 90084 79686

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

కేజీబీవీని సందర్శించాలి

శంకరపట్నం: కేశవపట్నం కేజీబీవీని కలెక్టర్ సందర్శించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్ ప్రకటనలో కోరారు. తొమ్మిది మంది విద్యార్థులను ఎలుకలు కొరికితే గోప్యంగా ఉంచిన స్పెషల్ ఆఫీసర్ మాదవిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం కేజీబీవీ సందర్శనకు వెళ్తే అనుమతివ్వలేదని ఆరోపించారు. విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ సందర్శించాలన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తిలో దివంగత సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి ఆదివారం గ్రామ నాయకులు నివాళి అర్పించారు. పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి మాట్లాడుతూ... సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె చిన్నస్వామి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, చిగురుమామిడి మండల రైతు సంఘం అధ్యక్షుడు కోమటిరెడ్డి జయ్‌పాల్‌రెడ్డి, కార్యదర్శి ఎండీ ఉస్మాన్‌పాషా, నాయకలు కూన భాస్కర్, బింగి స్వామి, పున్నం రాములు, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి, బాబు, సంపత్, బాల్‌రాజు, వెంకటి, బాలయ్య, కొంరయ్య పలువురు పాల్గొన్నారు.

సన్మానం



నరేశ్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

గన్నేరువరం: రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాచకొండ నరేష్ నియామకమయ్యారు. ఆదివారం గన్నేరువరం మండల సంఘం నాయకులు కరీంనగర్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. మండల అధ్యక్షుడు మునిగంటి నాగరాజు, గ్రామ అధ్యక్షుడు మునిగంటి మల్లయ్య, తెలంగాణ రజక సంఘం జిల్లా బాధ్యులు లింగంపల్లి సమ్మయ్య, గునుకులకొండాపూర్ గ్రామ అధ్యక్షుడు లింగంపల్లి అనిల్, లింగంపల్లి క్రాంతి, మునిగంటి మహేష్, వివిధ గ్రామాల రజక సంఘం అధ్యక్షులు, యువకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణారెడ్డి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి 18వ వార్డుకు చెందిన పలువురు యూత్ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కారించడం లేదని, పీఎం మోదీ సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో నాగరాజు, సురేష్, సారంగాపాణి, సాగర్, పర్వత శివ, పెండ్యాల వంశీకృష్ణ, ఆకుల రాహుల్, ఎండీ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

సికిందర్ భక్త్ జయంతి

కరీంనగర్ టౌన్: నగరంలోని పార్లమెంట్ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ, మాజీ గవర్నర్, కేంద్ర మంత్రి, పద్మ విభూషణ్ సికిందర్ భక్త్ జయంతి ఆదివారం బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ సికిందర్‌భక్త్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నిజాయితీపరుడిగా, సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తిగా సికిందర్‌భక్త్ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సమీపరవేజ్, తాజుద్దీన్, సమ్యుల్లా అహ్మద్, షహజాద్, సాబీర్ ఫసి, సిద్ధిక్,సైద్, అర్షన్, ఫైయ్యాజ్ చిస్తీ పాల్గొన్నారు

వ్యక్తిని కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: లోయర్ మానేరు డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన వ్యక్తిని లేక్ పోలీసులు కాపాడారు. వివరాలు.. కట్టరాంపూర్‌కు చెందిన సంపత్ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందామని డ్యాం వద్దకు రాగా లేక్ పోలీసులు గమనించి అప్రమత్తమయ్యారు. అతడిని కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రాణాలు కాపాడిన హోంగార్డు శ్రీనివాస్‌ను సీపీ గౌస్ ఆలం అభినందించారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి, నాయకులు

జమ్మికుంట: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఏటా అందించాల్సిన యూరియా కోటాలో కేంద్రం కోత విధించడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, సొసైటీల వద్ద క్యూలో చెప్పులు పెడుతూ జాగారం చేయాల్సి వస్తోందని, కలెక్టర్ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి అన్నదాతకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుంచి 31వరకు స్థానిక సమస్యలపై మండల కమిటీ ఆధ్వర్యంలో క్యాంపెయిన్ నిర్వహించనున్నామని, సమస్యల పరిష్కరించే వరకు పోరాటం, ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శీలం అశోక్, బాసిర సంపత్‌రావు, జక్కుల రమేశ్‌యాదవ్, వడ్లూరి కిషోర్, కన్నం సదానందం, దండిగారి సతీష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ అందరి బాధ్యత



గన్నేరువరంలో విశ్వహిందూ పరిషత్ సమావేశం

గన్నేరువరం: గోమాత సంరక్షణ అందరి బాధ్యతని విశ్వహిందూ పరిషత్ ముఖ్య కార్యకర్తల ప్రకాండ ప్రముఖ్ బండి గంగయ్య అన్నారు. విశ్వ హిందూ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి హాజరై మాట్లాడారు. గోవును దేవతగా భావిస్తామని వీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. గో సంపదే దేశ సౌభాగ్యమని దేశ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యంగా వ్యవసాయరంగానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లగొని మల్లయ్య, కరివేద మహిపాల్‌రెడ్డి, బుర్ర మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీదుబ్బామల్లికార్జున స్వామి ఆలయం ఆవరణలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈసందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్యులు సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ముందున్నారని, పేద ఆర్యవైశ్యులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యులను గెలిపించుకోవాలని, సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు ఎలిమిల్ల రాజేంద్రప్రసాద్, నర్సన్న, ప్రముఖ వ్యాపారులు బచ్చు భాస్కర్, జిల్లా అధ్యక్షుడు చందరాజు, జిల్లా నాయకులు యాద సతీష్, అకినపల్లి మురళి, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముక్క మాధవ, యూత్ అధ్యక్షుడు శ్యామ్, వాసవి క్లబ్ అధ్యక్షుడు అయితు రమేష్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు అకిలాండం నాయకులు పాల్గొన్నారు.

చేతిరాతపై శిక్షణ



పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ చేతిరాత నిపుణుడు దిడ్డి సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ కార్యమం నిర్వహించారు. అనంతరం చేతిరాత పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం వేణుమాధవ్, టీచర్లు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మ జాగరణ సమన్వయ రామడుగు మండల కమిటీ




మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

రామడుగు: మండల కేంద్రంలో ఆదివారం ధర్మ జాగరణ రామడుగు మండల కమిటీ సభ్యుల ప్రత్యేక సమావేశం నిర్వహి ంచారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా భూత్కూరి రాజమల్లయ్య, సంయోజక్‌గా జైపాల్‌రెడ్డి, సహసంయోజక్‌గా ఉప్పునీటి శేఖర్, సంస్కృతి ప్రముఖ్‌గా తుమ్మనపల్లి ఆంజనేయులు, పరియోజన్ ప్రముఖ్‌గా రేణికుంట శంకరయ్య, విధి ప్రముఖ్‌గా ఆడెపు రమేష్, నిధి ప్రముఖ్‌గా కోస్న నారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశంలో ధర్మజాగరణ మండల సమన్వయకర్త పాకాల రాములుగౌడ్, రామడుగు ఖండ ప్రముఖ్ మాడిశెట్టి గంగాధర్ పలువురు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మంచిర్యాల్ చౌరస్తాలోని మహదేవ ఆటో కార్మిక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెల్లి పెద్దన్న, ప్రధాన కార్యదర్శిగా మేకల మల్లేశం, ఉపాధ్యక్షుడిగా సంకూరి రమేశ్, కోశాధికారిగా కోరుకంటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా ఎంద్ర లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా నీలి రమేశ్ ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి అండర్-15 సుబ్రతో ఫుట్‌బాల్ కప్ టోర్నమెంట్‌లో మొదటి స్థానాన్ని సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్‌లు సాయి కిరణ్, అనూప్ తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ జిల్లా తరపున పాల్గొంటున్నట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులను స్కూల్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్, పీడీ మురళీధర్‌లు అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

జనహితకు తరలిన నాయకులు



పాదయాత్రకు తరలివెళ్తున్న నాయకులు

రామడుగు: గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామం నుంచి గంగాధర చౌరస్తాలోని మధురానగర్ వరకు కాంగ్రెస్ పార్టీ ఆదివారం సాయంత్రం చేపట్టిన జనహిత పాదయాత్రకు మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు భారీగా తరలివెళ్లారు. బస్సులు, బైకులు, ఇతర వాహనాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన రాజిరెడ్డి

శంకరపట్నం: కాంగ్రెస్ జనహిత యాత్ర సందర్భంగా జిల్లాకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి సన్మానించారు. ఆయనతో పాటు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు యాత్రలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



రామడుగు: పోలీసుల అదుపులో నాయకులు

చొప్పదండి/రామడుగు: కాంగ్రెస్ జనహిత పాదయాత్ర గంగాధర మండలంలో నిర్వహిస్తున్న దృష్ట్యా చొప్పదండి, రామడుగు పోలీసులు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులను ఆదివారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టు అయినవారిలో రామడుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మామిడి తిరుపతి, నాయకులు జూపాక మునీందర్, పంజాల జగన్మోహన్‌గౌడ్, పూదురి మల్లేశం, సైండ్ల కరుణాకర్, లచ్చయ్య, మల్లేశం, ఒరపల్లి ప్రశాంత్, లంక మల్లేశం, చొప్పదండి ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, గన్ను శ్రీనివాస్ రెడ్డి, వడ్లూరి శేఖర్, మావురం మహేశ్, మారం యువరాజ్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మొగిలి మహేశ్, గుర్రం సమరసింహారెడ్డి తదితరులున్నారు.

మళ్లీ కొనుగోలు చేయొద్దు

హుజూరాబాద్: యూరియా బస్తాలను ఇప్పటి వరకు కొనుగోలు చేయని రైతులకు మొదటి ప్రాధాన్యత కింద బస్తాలను ఇవ్వడం జరుగుతుందని ఏడీఏ సునీత ఆదివారం ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని అన్ని మండలాలకు త్వరలో యూరియాను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే యూరియా బస్తాలను కొనుగోలు చేసిన రైతులు తిరిగి కొనుగోలు చేసేందుకు రావొద్దని సూచించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన యూరియా బస్తాల వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిపారు.

నిండుకుండలా చెల్పూర్ పెద్ద చెరువు



హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ పెద్ద చెరువు ఇటీవల కురిసిన వర్షాలతో జలకళను సంతరించుకుంది. చెరువు సుమారు 135 ఎకరాల్లో విస్తీరించి ఉండగా, సుమారు 700 ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కట్టపై ఉన్న లైటింగ్‌తో మరింత శోభాయమానంగా చూపరులను ఆకట్టుకుంటోంది. ప్రజలు సెల్ఫీలు దిగుతూ సంబరపడుతున్నారు.

పేదలకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని నిరుపేదలను వెంటనే గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని పాత శిశుమందిర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రమేయం లేకుండా అధికారుల పర్యవేక్షణలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రజాధనంతో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయని, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయకుండా ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయి తప్పా పేదలకు న్యాయం చేయడం లేదన్నారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రావుల వేణు, తూముల శ్రీనివాస్, నల్ల సుమన్, సబ్బని రమేష్, యాంసాని శశిధర్, నరాల రాజశేఖర్, గంట సంపత్, బోరగాల సారయ్య, కొలిపాక వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనం



నగదు పంపిణీ చేస్తున్న నాగయ్య, తదితరులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో ఆదివారం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అలాగే పలువురు రైతులకు నగదు అందజేశారు. ఈసందర్భంగా హుస్నాబాద్ పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ నాగయ్య మాట్లాడుతూ... రైతుల సంక్షేమం కోసం డెయిరీ నుంచి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్, సుందరగిరి పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు పిట్టల తిరుపతి, డైరెక్టర్లు గందె రమేశ్, శ్రీనివాస్, గండికోట చిన్న శ్రీనివాస్, బట్టు మల్లయ్య, శ్రీమూర్తి శ్రీనివాస్, పెసరి శ్రీనివాస్, పత్తెం రమేశ్, గందె రాజు, ఎనగందుల శారద లతో పాటు కార్యదర్శి మెడబోయిన శ్రీనివాస్, సహాయకులు వెంకటేశ్, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు

- మండలానికి 183 యూనిట్లు కేటాయింపు
- రైతు వేదికల్లో దరఖాస్తుల స్వీకరణ
- 6 వరకు గడువు



రైతు నుంచి దరఖాస్తు తీసుకుంటున్న ఏవో సత్యం

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలను మంజూరు చేస్తోంది. గతంలో అమలులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో నిలిపివేసింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 2025-26 సంవత్సరానికి జిల్లాకు మొత్తం 2,822 యూనిట్లు మంజూరు కాగా.. కరీంనగర్ మండలానికి 183 యూనిట్లను కేటాయించారు. సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందిస్తారు. యంత్ర పరికరాలు కావాలనుకునే రైతులు కనీసం ఎకరం వ్యవసాయ భూమిని కలిగి ఉండాలి. ట్రాక్టర్ పరికరాల కోసం ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. శుక్రవారం నుంచి దుర్శేడ్, నగునూరు, మొగ్దుంపూర్, చామనపల్లి రైతు వేదికల్లో ఏఈవోలు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

అందుబాటులో ఉన్న పరికరాలు

కరీంనగర్ మండలానికి మొత్తం 183 వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను కేటాయించారు. పనిముట్లకు సబ్సిడీ రూ.14.65లక్షలను మంజూరు చేశారు. బ్యాటరీ స్ప్రేయర్లు 135, పవర్ స్ప్రేయర్లు 22, రోటవేటర్లు 8, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లరు 1, కల్టివేటర్ 13, పవర్ వీడర్ 1, బ్రష్ కట్టర్ 1, పవర్ ట్రిల్లర్ 1, స్ట్రా బేలర్ 1 యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేయాలంటే పెద్ద మొత్తంలో రైతులు ఖర్చు చేయాల్సి ఉండగా.. సబ్సిడీతో సగం ధరల్లోనే లభించే అవకాశముంది. సన్న, చిన్నకారు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నిర్ణీత గడువులోగా వచ్చిన దరఖాస్తులను మండలస్థాయి కమిటీ సభ్యులు ఏవో, ఎంపీడీవో, తహసీల్దార్లు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. రూ.లక్ష లోపు పరికరాలుంటే మండలస్థాయి కమిటీ, ఆపైన ఉంటే జిల్లాస్థాయి కమిటీ సభ్యులు ఎంపిక చేస్తారని అధికారులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి. శుక్రవారం నుంచి రైతు వేదికల్లో ఏఈవోలు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. వచ్చేనెల 6 వరకు సంబంధిత పత్రాలతో ఆయా గ్రామాల ఏఈవోలకు దరఖాస్తులను అందించాలి.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి